నిషికకు స్వర్ణం

నిఖిల్‌కు కాంస్యం

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో తెలంగాణకు మూడో స్వర్ణం దక్కింది. టేబుల్ వాల్ట్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్రానికి చెందిన నిషిక అగర్వాల్ గోల్డ్ మెడల్ గెలుచుకుంది. బుధవారం జరిగిన ఈ ఈవెంట్ ఫైనల్‌లో నిషిక.. 12.717 పాయింట్లు స్కోరు చేసి పసిడి కైవసం చేసుకుంది. నిషికతో పాటు యువ రెజ్లర్ నిఖిల్ యాదవ్ జాతీయ క్రీడల్లో కాంస్యంతో సత్తా చాటాడు. 65 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో అతడు కాంస్యం గెలిచాడు. కర్నాటక రెజ్లర్ మహేశ్‌పై 12 పాయింట్ల టెక్నికల్ సుపీరియారిటీతో నిఖిల్ బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నాడు. ఇక మిక్స్‌డ్ నెట్‌బాల్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ.. 38-31తో ఉత్తరాఖండ్‌ను ఓడించి సెమీస్‌కు చేరింది. ఇప్పటిదాకా ఈ క్రీడల్లో తెలంగాణకు 3 స్వర్ణాలు, 3 రజతాలతో పాటు 10 కాంస్య పతకాలు దక్కాయి.

భారత్ శుభారంభం

కింగ్డో (చైనా): బ్యాడ్మింటన్ ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. బుధవారం ఇక్కడ జరిగిన లీగ్ దశ మొదటి మ్యాచ్‌లో భారత్ 5-0తో మకావుపై ఘనవిజయం సాధించి క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకుంది. తొలుత మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్ కుమార్-ఆద్య వరియత్ జంట 21-10, 21-9తో చొంగ్ లియోంగ్-వెంగ్ చిపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-16, 21-12తో పంగ్ వంగ్‌ను చిత్తు చేశాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 21-15, 21-9తో హావొ వై చన్‌పై గెలిచి ఆధిక్యాన్ని 3-0కు తీసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టి -ఎంఆర్ అర్జున్ ద్వయం.. 21-15, 21-19తో చిన్ పొన్ పుయ్-కొక్ వెన్ వాంగ్‌పై నెగ్గారు. మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీ 21-10, 21-5తో వెంగ్ చి-పుయ్ చిపై గెలిచింది. లీగ్ దశలో భారత్ గురువారం దక్షిణ కొరియాతో తలపడనుంది.

ఆర్‌సీబీ సారథి ఎవరో?

- నేడే కెప్టెన్ పేరు ప్రకటన

బెంగళూరు: ఐపీఎల్‌లో ఇంతవరకూ ఒక్క ట్రోఫీ నెగ్గకపోయినా క్రేజ్ విషయంలో మాత్రం అగ్రశ్రేణి జట్లతో సమానంగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు శుభవార్త. 2025 సీజన్‌లో ఆ జట్టును నడిపించేదెవరో గురువారం తేలనుంది. నేడు ఉదయం 11:30 గంటలకు ఆర్‌సీబీ.. కెప్టెన్ పేరును అధికారికంగా ప్రకటించనుంది. గత మూడు సీజన్ల పాటు ఫాఫ్ డుప్లెసిస్ సారథ్య బాధ్యతలు మోసాడు. కెప్టెన్సీ రేసులో విరాట్ కోహ్లీ ముందు వరుసలో ఉన్నాడు. గతంలో కోహ్లీ.. ఆర్‌సీబీని 2013 నుంచి 2021 సీజన్ దాకా సారథిగా వ్యవహరించాడు.

ఫైనల్లో పాక్

కరాచీ: స్వదేశంలో చాంపియన్స్ ట్రోఫీకి ముందు జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. కరాచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్.. 6 వికెట్ల తేడాతో గెలిచింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 352 పరుగుల భారీ స్కోరు చేసింది. క్లాసెన్ (87), బ్రీట్జ్‌కె (83), బవుమా (82) రాణించారు. లక్ష్య ఛేదనను పాకిస్థాన్ మరో ఆరు బంతులు మిగిలుండగానే దంచేసింది. మహ్మద్ రిజ్వాన్ (122 నాటౌట్), అఘా సల్మాన్ (134) శతకాలతో కదం తొక్కి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఫైనల్‌లో పాకిస్థాన్.. న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

విజయం పరిపూర్ణం

వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్ • అహ్మదాబాద్‌లోనూ తేలిపోయిన ఇంగ్లండ్

గిల్ శతక జోరు • కోహ్లీ, శ్రేయస్ హాఫ్ సెంచరీలు • బౌలర్ల సమిష్టి కృషి

గిల్ (112)

1 ఒకే వేదికలో మూడు ఫార్మాట్ల లోనూ శతకాలు బాదిన (భారత్ తరఫున) తొలి క్రికెటర్ గిల్. టెస్టు, టీ20లతో పాటు వన్డేలలోనూ ఇక్కడ సెంచరీ చేశాడు. ఐపీఎల్‌లో సైతం గిల్ శతకం సాధించాడు.

అహ్మదాబాద్: ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 142 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది. అహ్మదాబాద్‌లో మ్యాచ్ అంటేనే రెచ్చిపోయి ఆడే శుభ్‌మన్ గిల్ (102 బంతుల్లో 112, 14 ఫోర్లు, 3 సిక్సర్లు) తన కెరీర్‌లో 7వ శతకంతో కదం తొక్కగా.. శ్రేయస్ అయ్యర్ (64 బంతుల్లో 78, 8 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లీ (55 బంతుల్లో 52, 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో భారత్ 356 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం ఛేదనలో ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకే చేతులెత్తేసింది. టామ్ బాంటన్ (41 బంతుల్లో 38, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), గస్ అట్కిన్సన్ (19 బంతుల్లో 38, 6 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ (22 బంతుల్లో 34, 8 ఫోర్లు) దూకుడుగా ఆడినా మిగిలిన బ్యాటర్లు విఫలమవడంతో ఆ జట్టుకు భారత గడ్డపై 14 ఏండ్ల తర్వాత వన్డే సిరీస్‌లో వైట్‌వాష్ ఎదురైంది. సిరీస్ ఆసాంతం రాణించిన శుభ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' కూడా లభించింది.

ప్రిన్స్, కింగ్ హవా

భారత ఇన్నింగ్స్‌లో కింగ్ కోహ్లీతో పాటు టీమ్ ఇండియా అభిమానులు అతడి వారసుడిగా పిలుచుకునే ప్రిన్స్ గిల్ ఆటే హైలైట్. ఈ ఇద్దరూ తమకు అచ్చొచ్చిన అహ్మదాబాద్‌లో అదరగొట్టారు. కటక్‌లో శతకం చేసిన రోహిత్ శర్మ (1).. వుడ్ రెండో ఓవర్లో సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశపరిచాడు. కానీ అతడి స్థానంలో వచ్చిన కోహ్లీ మాత్రం సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. తన మార్కు షాట్లతో అభిమానులను అలరించిన రన్‌మిషీన్.. క్రీజులో కుదురుకున్నాక జోరు పెంచాడు. మరో ఎండ్‌లో గిల్ కూడా బౌండరీలతో రెచ్చిపోయాడు. రషీద్ 17వ ఓవర్లో బంతిని కవర్స్ మీదుగా బౌండరీకి తరలించడంతో గిల్ అర్ధశతకం పూర్తయింది. ఆ మరుసటి ఓవర్‌లోనే కోహ్లీ.. లివింగ్‌స్టన్ వేసిన రెండో బంతిని పాయింట్ మీదుగా సిక్సర్ బాది 73వ వన్డే ఫిఫ్టీ సాధించాడు. అయితే రషీద్ (4/64) వేసిన 19వ ఓవర్లో కోహ్లీ బ్యాట్‌ను ముద్దాడుతూ వెళ్లిన బంతి సాల్ట్ చేతిలో పడటంతో 116 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

కోహ్లీ (52)

అయ్యర్.. తగ్గేదేలే

కోహ్లీ నిష్క్రమించినా ఈ సిరీస్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న శ్రేయస్ రాకతో స్కోరుబోర్డు మరింత ఊపందుకుంది. గిల్, శ్రేయస్.. బౌండరీలతో విరుచుకుపడటంతో ఇంగ్లండ్ ఫీల్డర్లు ప్రేక్షకుల్లాగా మారిపోయారు. వుడ్ 32వ ఓవర్లో రెండో బంతిని బౌండరీ బాదిన గిల్.. సెంచరీని నమోదుచేశాడు. అయ్యర్ సైతం 43 బంతుల్లోనే ఫిఫ్టీ బాదాడు. అతడికి ఇది 20వ అర్ధ శతకం. కానీ స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరినీ రషీద్ పెవిలియన్‌కు పంపాడు. గిల్, శ్రేయస్ మూడో వికెట్‌కు 104 పరుగులు జోడించారు. ఆఖర్లో కేఎల్ రాహుల్ (29 బంతుల్లో 40, 3 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ (17) వేగంగా ఆడి భారత్‌కు రికార్డు స్కోరును అందించారు.

దూకుడుగా మొదలై.. వేగంగా ముగిసి..

60/0. ఛేదనలో భాగంగా 6 ఓవర్లకు ఇంగ్లండ్ స్కోరిది. డకెట్, సాల్ట్ దూకుడు చూస్తే లక్ష్యం మరీ చిన్నదైపోతుందా? అన్న అనుమానం కలిగింది. హర్షిత్ రెండో ఓవర్లో 2 ఫోర్లు బాదిన డకెట్ అతడే వేసిన 4వ ఓవర్లో మరో మూడు బౌండరీలు కొట్టాడు. అర్ష్‌దీప్ 5వ ఓవర్లోనూ నాలుగు సార్లు బంతి బౌండరీలైన్ దాటింది. కానీ అతడే వేసిన 7వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన డకెట్.. మిడాఫ్ వద్ద రోహిత్‌కు చిక్కాడు. సాల్ట్ (23)ను సైతం అర్ష్‌దీప్ స్లో బాల్‌తో బోల్తా కొట్టించాడు. ఆరంభంలోనే ఔట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న బంటర్ కొన్ని భారీ షాట్లు ఆడాడు. కానీ స్పిన్నర్ల రాకతో ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రూట్ (24)ను అక్షర్ బౌల్డ్ చేయగా సెకండ్ స్పెల్‌లో బంతిని అందుకున్న హర్షిత్.. ప్రమాదకర బట్లర్ (6), బ్రూక్ (19)ను క్లీన్‌బౌల్డ్ చేసి ఇంగ్లండ్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. లివింగ్‌స్టన్ (9) విఫలమవగా ఆఖర్లో అట్కిన్సన్ ఉన్నంతసేపు మెరుపులు మెరిపించి ఇంగ్లండ్ ఓటమి అంతరాన్ని తగ్గించాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ (2/33), హర్షిత్ (2/31), అక్షర్ (2/22), హార్దిక్ (2/38) సమిష్టిగా రాణించారు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 356 ఆలౌట్ (గిల్ 112, శ్రేయస్ 78, రషీద్ 4/64, వుడ్ 2/45); **ఇంగ్లండ్:** 34.2 ఓవర్లలో 214 ఆలౌట్ (బాంటన్ 38, అట్కిన్సన్ 38, అక్షర్ 2/22, హర్షిత్ 2/31)

ఆసీస్‌కు లంక ఝలక్

కొలంబో: స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం కొలంబోలో జరిగిన మొదటి మ్యాచ్‌లో కంగారూలకు శ్రీలంక షాకిచ్చింది. లో స్కోరింగ్ థ్రిల్లర్‌గా సాగిన మ్యాచ్‌లో లంక 49 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన లంకేయులు.. 46 ఓవర్లలో 214 రన్స్ చేశారు. కెప్టెన్ చరిత్ అసలంక (127), దునిత్ వెల్లలగె (30) ఆ జట్టును ఆదుకున్నారు. అనంతరం స్వల్ప ఛేదనలో ఆసీస్.. 33.5 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. లంక స్పిన్నర్లు మహీశ్ తీక్షణ (4/40), వెల్లలగె (2/33) కంగారూలను కట్టడి చేశారు.

సెమీస్‌కు కేరళ

పూణె: రంజీ ట్రోఫీ సీజన్ 2024-25లో కేరళ సెమీస్‌కు దూసుకెళ్లింది. జమ్మూకాశ్మీర్‌తో జరిగిన మొదటి క్వార్టర్స్ పోరును కేరళ డ్రా చేసుకున్నా తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగు ఆధిక్యం దక్కించుకున్న ఆ జట్టు సెమీస్‌కు అర్హత సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో జమ్మూకాశ్మీర్ 280 పరుగులకు ఆలౌట్ అవగా కేరళ 281 రన్స్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో జమ్మూ నిర్దేశించిన 399 పరుగుల ఛేదనలో కేరళ.. 6 వికెట్లు కోల్పోయి 295 పరుగులు చేసింది. సెమీస్‌లో కేరళ.. గుజరాత్‌తో తలపడనుంది. ఈనెల 17 నుంచి సెమీస్ పోటీలు మొదలవుతాయి.

స్టార్క్ ఔట్



సిడ్నీ: చాంపియన్స్ ట్రోఫీ ఎదుట ఆస్ట్రేలియాకు మరో ఎదురుదెబ్బ. ఇప్పటికే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ నుంచి ఆసీస్ పేస్ వీరులు జోష్ హెజిల్‌వుడ్, పాట్ కమిన్స్, ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ గాయాల కారణంగా తప్పుకోగా మార్కస్ స్టోయినిస్ రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా ఆ జట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ సైతం టోర్నీకి దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాలతో అతడు తప్పుకున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా బుధవారం తెలిపింది. కాగా చాంపియన్స్ ట్రోఫీలో ఆసీస్‌కు స్టీవ్ స్మిత్ సారథిగా వ్యవహరించనున్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.